ఆల్వనా



వాడపల్లి లక్ష్మీనారాయణాచార్యులు

కథలు

గీత

ముట్టె పైకెత్తిన యెలుగ్గొడ్డులావుంది వెలగాడ కొండ! ఈ కొండగుర్తు చెప్తేనే చాలు యెంత కొత్తవాడైనా సరే విజయనగరాన్ని యిట్టే పసిగట్టేస్తాడు. రాల్లు పొదిగిన నీలి ముఖమల్ కిరీటంలాగా కనుచూపు మేరనుంచీ కనిపించే ఆ కొండ మీది భనంతి అలనాటి రాచరికం ఠీవికి విలాసానికీ గుర్తుగా నిలిచి వుంది. ఆ కొండ డిగూగా దక్షిణం తట్టుమీద నుంచొని చూస్తే—

వొకటీ వొకటిన్నర కిలోమీటర్ల దూరంలో ప్రారంభమయ్యే నగరం పొలిమేర అర్ధచంద్రాకారంగా కొండని తాకుతూ కనిపిస్తుంది ఈ మధ్య జాగాలో యెక్కడపడితే అక్కడున్న తాటి పెండెలూ యీత తోపులు; చెదురు మదురుగావున్న వేరుసెనగ పొలాలూ; అక్కడోటీ యిక్కడోటీగా వున్న తోటలూ; వీటన్నిటినీ అడ్డుగా చీలుస్తున్న రైలుకట్టా కనిపిస్తాయి తలకొట్టిన తాటికాయ మీద ముంజెలు కనిపించినట్లుగా మూడు చెరువులు కనిపిస్తాయి! తూర్పువైపు దూరంగా వున్న కిత్తయ్య కోనేటికి కొంచెం యెడంగా వీరబ్రహ్మం గారి మఠమూ, యేతవీధి కన్పిస్తాయి. ఇక పడమటి వైపు దూరంగా నగరం పొలిమేరల్లోంచీ మెలికలు తిరుగుతూ బుచ్చన్న కొనేటినీ, సరసయ్య కోనేటినీ శ్మశానాన్నీ రాసుకొంటూ తిన్నగా కొండ వెనుక తట్టునన్న వెలగాడ వూరికి పోయే నాటురోడ్డు కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది.

వెలగాడ కొండ నిండా దట్టంగా చెట్లుండడం వల్లా; వెనకనుంచీ గొలుసు కట్టుగా కొండలూ వాటిమధ్యనున్న లోయల్లో చిట్టడవులూ వుండడం వల్లా అడపా తడపా కొండమీంచి చిరుతపులూ, కలివిగోలలూ, చిట్టడులూ, ఎలుగు బంట్లూ రావడం కద్దు.

కిత్తయ్య కోనేటికి పడమటి వైపున్న తాటిపెండె మధ్యలో ఠగూన వీరాసనంలో సింహాచలం ఖాళీ కల్లుకుండల మధ్యగా కూర్చొని, కాలికింది అదిమిపుంచిన గీతబడితె మీది చిన్నసొట్టలో రాతిపొడి చల్లి కత్తిని సాన బడుతున్నాడు.

సాయంకాలం నీరెండ తాటి మొవ్వుల్లో పడి మెరుస్తోంది. గాలికి తాటి మట్టలు వొకదానికొకటి మాటిమాటికీ వూగుతూ తగలడంవల్ల గలగలమని శబ్దం వొస్తోంది తాటి మానుల వెనక నుంచి యెండ దిగూన పడడం వల్ల నేలంతా గీతల్లాగ పడిన నల్లనినీడలతో తెల్లని యెండ చారలతో జీబ్రా చర్మాన్ని పరిచినట్టుంది.

సింహాచలం సానబడుతూ పడుతూ గీతాన్నందుకొన్నాడు.

“పస నేమర యీసంసారవుఁనోపల - యిసురుగ తిరగకురోరన్నా
పనిట కాయలో పురుగు సందవుఁన - పుసుక్కుమనురోరన్నా!”

ఇంతలో అతని కొడుకు పైడితల్లి వో చెట్టుమీంచి దిగేడు. కండలు మెలి తిరిగిన ఇనపకమ్మీలాంటి శరీరం మీంచి చెమట మెరుసుకుంటూ కారుతోంది, నడుముకి చుట్టూరా చుట్టిన మోకు వీపువైపు నడుంకి కట్టిన బల్లకి తగలడంవల్ల టక్కుటక్కుమని శబ్దం వొస్తోంది. మూతులికి వగ్గాం తళ్ళు బిగించి రెండు చేతుల్తోనూ పట్టుకున్న కుండల్లోంచీ తెల్లని నురగలు. ఎగజిమ్ముతున్నట్టుండగా తండ్రివైపోస్తూ “వోరయ్యా! మేటిమద్దేలక్కట్టిన ఏరుతట్టిలోన్కి సందేల నాలుగాటికే పూరా కల్లొడిసిపోనాది! యీ పోతుసెట్టు వొడిసిపట్టుగా పెండిల మనం హర్రాజు సేసిన సెట్లనీ వొడిసేసుకొచ్చి నయ్యంటే బాగున్ను-తన్నెలబంద - మున గుడిసె వూడనాగేసి ఆ కొండమీదున్న మేడ నాంటి మేడన్నేపెద్దువుఁ” అన్నాడు. పదిలంగా కుండల్ని తండ్రి దగ్గర పెట్టి; పక్కనున్న తాటి మొక్కనుంచి వో కమ్మని కోసేడు. దాన్ని రెండుగా చేసి మంచి వొడుపుగా బొటనవ్రేలితో నొక్కరాస్తూ చిన్న గిన్నెలా మడిచి కొసల్లో ముడి పడేలా ఆకుమెలేసి చక్కని రెండు పాయల్ని చేసేడు తన కత్తిని బడితెదగ్గర బెట్టి, సానబెట్టిన కత్తిని బల్లలో పడేసుకొంటూ, దిగూన గొంతుకిల్లా కూర్చున్నాడు.

సింహాచలం మాట్లాడకుండా కళ్లు మూసుకొని కల్లుకుండలకి దణ్ణంపెట్టి; కొడుకు చేతిలోంచి వో పాయను తీసుకున్నాడు. కుండలో నురగ పక్కకు పోయేలా మెల్లగా వొంది, చిన్న మట్టిముంత ముంచి పాయనిండా కల్లుపోసేడు. ఆ పాయని దోసిట్లో తొణక్కుండా పట్టుకొని అలానే పదిలంగా పైకెత్తి

ఆకాశంలోకి కళ్ళు మూసుకు చూస్తూ కొంచెం సేపుంచేక; దించి కళ్ళకద్దుకొని కొడుక్కి అందించేడు. రెండోపాయలో తనకు పోసుకొని కొంచెం కొంచెం తాగుతూ—

"వోరి ఆసెట్టుతో కదం సెట్లకి పోలికేటిరా? ఆసెట్టు వొనలచ్చిమి. నువ్వు మీయమ్మ కడుపుల వుండగా ఆసెట్టు పుట్టినాది దాని ధాన్నిబొరికిని మనకి నిదానంగున్నాది సూడు ఆసెట్టు నించి నాసేతుల్తొ నాను తీసి పాతినానుర. ఆసెట్టు బురుకుని ఆకాడ యెనగాడ రోడ్డు మదుంకాడి పుంతలవున్న వొంకర సెట్టునించి మాబాఁబుఁ తీసి, నాను నీయంత జబర్దస్తీగున్నప్పుడు పాతినాడు. ఆ వొంకర సెట్టుకి నాను మాయమ్మకడుపుల వుండినప్పుడు మా తాత టెంక పాతినాడు.- యేటో వుండనేక మనవిఁలా టెంకలు పాతుకోడవూఁ మొక్కొచ్చి పెరిగినాక సరకారోళ్లు అంకెనేసి అబ్కారకి యేలఁవెఁయ్యడవూఁను!....నాను సెప్పేదేంటంటె ఆ సెట్టుకి జోడీగున్న సెట్టు యీ కవఁతం మొత్తం యీకాడికి నేదు యి నాక్కత్తితో గీతలెట్టినానంటే సాలు జిలజిల వూటనాగ సెపురుసు కొచ్చేత్తాది.

"యేటిర నీపిచ్చి గాని యేటి మనం పాడుకున్న అరపాతిక సెట్లూ పూరా వొడుసుకుంటెనె మనం మారాజులవైఁ బవంతుల్నెపెత్తావేఁటిర అనా సూసినావా- ఆసెట్ల నీడలు ఎలగ్గీతలమ్మటా యెనాగున్నయో! మన బతుకులన్ని నీడల్లాఁటివిర ఆపెద్దోల్లందరి బతుకులు యెలుతురు నాటివిర! వోరి యెనాటెనాటోల్లెఁదరొచ్చి యేటి సేసిన మనవిఁడిగిలాగె వుంటవు! యీ పెపంచకం నోంచి పూరాగా నీడలే కాడికన్నా యెగురుకు పోతయ్యేటిరా! నీడల్ని దొరకబుచ్చుకు తగిలెయ్యడవుఁ యెవురి వొసెం?!- మన గెఅసారవూఁ నుదుట్ల గీతా బాగుపడాల అంతె గానీ మనవెఁప్పుడికింతెర మనవెఁక్కడ- మేడలెక్కడ?! మనం అదప్పాతానంల వుంటె ఆదిగనాగమేడలు అంతెత్తునుంటాయిర! మనం సచ్చినా ఆటి నందుకోలేవుఁ మనవుఁ బెత్తాయిఁసుకొన్న కాడికి అన్ని సెట్లొకనాగ దిగితే కసింత నయంగ మరోడి కాద సెయ్యి సాపకుండ అప్పుల మనక్కుండ గడుత్తాదంటె. అఁతకన్నేటో మన కొఁగి పోతాదని ఆసెట్టుకోకురోరయ్య! ఆసె మాసెద్దది. నానన్నదంత.

"అటుయిటు పాటులు యీ సంసారం.
ఆసెలు నమ్మకురోరన్నా
ఘటము పుచ్చిన కుక్క సందమున.
లొటలొట తిరగకురోరన్నా!"

అని యెంత యిసిదంగా సెప్పినాడో సూడు" అన్నాడు ఖాళీ పాయని దూరంగా విసిరేస్తూ,

"వొరిగి పోతాడో నేవో అకాసి పెంటమ్మెట్టిన సారాబట్టీ సూసినా. యీకాసి తాడయ్య కల్లుపాక సూసినా తెలుసుకు పోతాది. ఆకాడికి యెవ్వఁడికీ లేని నత్తెకాలబ్బుద్ది నీకే వొట్టుకున్నాది. కల్లుతట్టికి నోపల్న సున్నఁయినా పులవఁనీయవు. కసింతయినా కల్లు మురసంగున్నాద మా మీఁదిర్కు పడిపోతావు. కోటాకలుపు కోప్పకోవుగందా! మరి మనవుఁవాడుకొన్న సెట్లయేరు మూడు సెట్లు కియ్యేల దాకింకా పాలైన దిగనేకు కల్లేటి దిగుతాది? కదం సెట్టుల నించి దింపింది దింపినట్టుగ అమ్మేసినామఁటే మరి మనవేఁటి యెనకేసుకొంటావోఁ సెప్పరయ్యా!"— పైడితల్లి ఇలా అంటూనే వోరెండు ఖాళీకుఁడల్ని పట్టుకులేచి, ఎదురుగావున్న వోచెట్టు దగ్గరకి వెళ్ళి మానుకి మోకుని మెలేసి చుట్టి; చెట్టుకి దణ్ణంపెట్టి, కాళ్ళకట్టుకొన్న త్రాటిని మోకునూ మీదకు జరుపుకొంటూ చెట్టెక్కడం మొదలెట్టేడు

"వోరోరి వొల్లకుండరేసి. యెదవ అన్నేయాని కొగ్గి డబ్బు సేసుకుంటానంటావేటిరా! ఆల్లెవులో గత్తర తినుకొన్నారన యేటి నవు కూడా తిండానికి అవిఁరి పోతావేటిర సెప్పు సీ—యెదవ బతుకు అన్నేయబ్బతుకు బతికేకన్న గంజినేక సావడం మంసిదని వొంట బట్టించుకోరా బాగుపడతావు. —వోరి! పెంటమ్మ నా బంగారమ్మెడెత్తుకొని వో పాలి నా కాసి యెగాదిగా సూడమని సెప్పి సూడరా. సూడగలుగద్దేవోఁ?!. సథ్! తలెత్తుకు తిరగలేని బతుకెందుకెటి. మడిసి జల్మమెత్తినాక నిజాయితీగుండాల. ఆ తౌడయ్య గాడు నీకు గురేటిర! ఆడెన్ని సుట్లు పోలీసుల పాలయిపోయిడో; ఆడిరకాయించుకొన్న సొమ్మంతా యెనాగ రోగాలికీ రొచ్చులకీ కరుసయిపోతన్నాదో వోరయ్య నీకు తెల్దేటి?. మురగబెట్టిన తట్టి మడ్డీ, గెంజీ, రిట్టకాయల పులుసూ— యీ నెక్కన నానా గడ్డీ మురసరంగదింపిన కల్లులకలిపేసి యేటి యీళ్ళకాడ తాగిన పున్నేనికి

యేడు తిరక్కుండగానె సంపేత్తారేటిర జనాల్ని?! అల్లైనా సచ్చిపోతే యీళ్ళ కేటి!— యీళ్ళకి డబ్బే పెదానవై(పోనాది. సీ— నాబొందిల పేనం వుండగా నేను సెయ్యనూ సెయ్యనీను" అన్నాడు సింహాచలం రెండు కుండల్లో వున్న కల్లునూ కడవలోకి గుమ్మరిస్తూ.

"వోరి బా(బూ! నీకా యీరబమ్మంగోరి మటంకాడి కబుర్లు పూరా తలకెక్కిపోనాయి-మరి నా కబుర్లేటి రుసిత్తాయి నే!.... నానేటి మినకాడ తాగడాని కొచ్చి నోల్లందరిని సంపేసి ఆ సొమ్మట్టుకు మనం మేడల్నే పుకొందవ(న్నా నేటిరయ్యా?!— పొద్దొచ్చేకట్టిన సట్టిని పొద్దు గూకినాకా; మాపిటేలకట్టింది పొద్దొచ్చేదాకా యిప్పుదవ(న్నాను. ఏరు సట్టెల కాడ వో అరసట్టే నెక్కన నీరు కలపమన్నాను. ఈ కాటికే గదమాయించుకు నామీదెగిరి పోతన్నావు.

వోరయ్య యీ యేటికి పాట సెట్టుకి నాలుగు పదులయిపోనాది. ఆ ఆపీ సోల్లకి రివాజులిచ్చుకొనే తలికి సెట్టుకి యేబయిపయి సిలుకయి కూకున్నాది. ఇంకేటి బావు(కుంటావో(నువ్వే పరకాయించు సూసుకో" అన్నాడు పైడితల్లి మొవ్వలోంచి. కల్లుదిగిన కుండల్ని జా(గత్తగా తీసి, కొత్తకుండల్ని కట్టేడు. కత్తి తీసుకుని మొవ్వలో గెల వెన్నులకి వెడల్పుగా ఎడగీత చెక్కి; గీరాపడి చుక్కలు నేరుగా కుండలో పడడానికి సన్నగా పొడుగ్గా చెక్కివుంచిన కమ్మ రేకుల్ని వెన్నులోకి దిగూన గుచ్చి రేకుకొసల్ని తట్టిల్లోకి జార విడిచేడు. తట్టె మీద గుడ్డా, తాటేకులూ కాకులు తాగేకుండా మూతేసేడు. మెల్లిగా మోకుల్ని దిగూకి నెట్టుకుంటూ దిగుతున్నాడు.

"అయితే నువ్వునేదేటిర!— అబ్కార పెంచేత్తే నువ్వేటి నీసేద్ది యెట్టు కుంటున్నావేటిరా! అరవయి పయిసాలువ్న సీసాకాయిని రూపాయికి నువ్వు పెంసుకుపోనేదేటి? మరి దానికిది సెల్లయిపోనాది కాదేటిర! నీ కలితీ కల్లుతో నీకాడి కొచ్చినాల్ల కడుపులన్నీ గుల్లసేసి నీ కడుపు నింపుకుంటావేటిర! వోరి నువ్వేటి కానుకోవడం నేదు- నిలూనా సెడిపోతావు(ర. మనకెందుకేస్- ఆ అన్నే యబ్బదుకు"- అని అంటూ సింహాచలం వో రెండు రాళ్ళని తీసుకొని వొకదాని మీద వొకటి టక్కూటక్కుమని కొడుతూ బడితే గతకలో మెత్తని రాతిపొడి పడేలా చేస్తున్నాడు.

"అన్నేయ వఁన్నేయవఁని తెగకోపవై పోతన్నావు - వోరి బాఁబోఁ నాను సూటిగ అడగతన్నాను సెప్పర!- యీగీతపనీ యినాక్కల్లమ్మకు బతకడవూఁ అన్నేయప్పనులుగావేటిర!- మా సెడ్డ కబుర్లాగ్గేత్తన్నావు?!-" చెట్టు దిగి ఉదుటుగా తఁడ్రిదగ్గిర కొచ్చి కల్లుకుండల్ని పక్కగా పెడతూ కొడుకు అన్నాడు. పక్కన డి డి టి పౌడరున్న చిన్న గుడ్డమూటని తీసుకొని మళ్ళీ తాను చెట్టు దగ్గిర కెల్లేడు. మానుకి చుట్టూరా నేలకి వో అడుగుయెత్తున కత్తితో నన్నగా చెక్కిన చిన్న గతకలో పౌడర్ అంటేలా చీమలు చెట్టుపైకెక్కకుండా గుడ్డ మూటని మెత్తగా కొడుతున్నాడు. నల్లని మానుపై తెల్లని వెండి కంకణాన్ని తొడిగినట్టుంది- అలా చేస్తుంటే.

"యిదేటిరోరయ్య మతోయినాదేటి నా పనిల తప్పెంచుతున్నావు నీకేం నెరవఁ?! మన పనికేటొచ్చినాదిర అన్నేయవూఁ?! మన కులవోఁల్లకి అనాదిగ యిదే కదేటి యిదాయకం. సెట్టుతల్లిన్నమ్మకు బతికే వోళ్ళం మనకేటిర తప్పొరిగిపోనాది! అయితే వోరయ్య- గవేఁలాలో పీకెల్నరికే వోడికీ, వొల్ల కాటిల పీనుగుల్నాక్కెల్లే వోడికీ, జయిలుల కాయిదా యెట్టేవోడికీ నువ్వేట న్నేయవెంచుతావేటిర? ఎవురి యిదాయకాన్నాల్లు సేసుకు పోడవుఁల అన్నేయ వేఁటినేదుర- మన పనిల యేదన్నా కలతీ సేసినావాఁ; మన యిదాయకానికి యిరుద్దంగా ఎవురన్నాగాని పొట్టనెట్టేసుకొన్నావాఁ-అదిగదిర అన్నేయవంటే!" ఇలా సింహాచలం చెప్పుకు పోతుంటే పైడితల్లి దగ్గరున్న చెట్టని ఎక్కుతూ దిగితూ వింటున్నాడు—

"వొరె కల్లంటె సెట్టుతల్లి లోకానికిచ్చిన వొరపెసాదవుఁర - వొన లచ్చిమి యిచ్చిన అమురుతవుఁరా! ఈ పెపంచకంలో వొనలచ్చిమిచ్చే తేని సానాసానా గొప్పదిర. దాన్ని సెప్పినాక దీన్నే సెప్పుకు తీరాలిరా. మరందుకే గదేటి తేని దొరక్కుండున్న యేలల్లా తేంటీగలూ, యెలుగ్గొడ్డులూ దీన్ని జుర్రుకు పోతాయి. వోరి సీవఁలూ, కాకులూ కూడా దీనికెగబడతన్నాయంటే దీని యిలవెంతున్నదో తెలుసుకోరేయ్!

గాంధీ తాత నాంటి వోడు యీ తీపికల్లుకున్న యిలవని యిసిదం సేసుకుని సారాబట్టీలన్నీ రద్దుసేయించి యీ గీతపని నల్లగుండాలని దీవించి నాడు రోరయ్య!

ఆ మద్దిల యిస్కూల్ల పనిసేసె పంతులు బాబొచ్చేవోడునే. ఇది తాగ టానికి. ఆ బాబు మా గొప్పగ అదేటో యింగిలీసు మాటలతో సెప్పినాడునే! నాకేటి నోరు తిరగదు. యీ భూపెపంచకంలో - దంపుడు బియ్యమిఁచ్చే సత్తువా; ఇదిగీ తీపికల్లిచ్చే సత్తువా - మరేకాదా, నేవేసేపుటోరయ్య!". అని 'అంటూ కొడుక్కి మరో పాయకల్లు అందించి; తాను కొంచెం పోసుకొని మళ్ళా అందుకొన్నాడు.

"అసలు దీని యిలవ మనోల్లెవురికీ యిసిదవేఁగానేదుర!. యేటి మన కులపోల్లంతా సంగవెఁట్టుకొని; అయిదరాబాదు సబనోకి వనోన్నొకన్ని అంప గానే అయిపోనాదేటిర! వొరె యెందుకిరయన్నీ - సంకనాకను!. నువ్వినుకున్నావోనేదో - మొన్న తాగడానికొచ్చిన జవాఁనుబాబు సెప్పినాడుర - పేపరుల సదువుకొనిచ్చి సెప్పినాడుర! ఆ సెన్నపత్తనం సరకారోల్లు యీమద్దిల అన్ని యిస్కూల్ల సదువుకొనె బుడ్డోల్లందరికీ పొద్దు గూకులా రివాఁజుగ యీ తీపికల్లు మోతాదుల తాగించేనాగ తాకీ దిచ్చినారట వోరయ్య యినుకుంటున్నవో వేదో! మన కన్న ఆల్లే మిడునుగ మంచిపని సేసినారు కాదేటి!

దొరికిన కాడికి రోజు కిడవకుండ యేరు పొద్దులమ్మటా తీపికల్లు తాగిన మడిసి యెనాగుఁటడు తెలసా - యినప కమీసీ నాగుఁటాడు తాటికల్లుని తాగి నోడు తాటి సెట్టునే వూపెయ్యాల!. యీముదనట్టపోల్లు ఆల్లూగి పోడానికీ వొళ్ల తిమ్మిరెక్కిపోడాకీ మురసంగున్న కల్లు తాగి మన పరువు తీత్తన్నారుగాని మన కేటిర తప్పు!

వోరి సెవినెడుతున్నావో నేదో - మరోటినుకో! మా బాఁబుఁకాలం తీరిందాక మనకీ పాట నేదు పాడూ నేదు. మురసంగ కల్లమ్ముకొనే వోడికే పాట. మనం తట్టిలికి పయినింత గొద్దిసున్నఁపులివిఁ కల్లొడిసి పట్టినాక తాటి బెల్లం వొండుకు బతికేవోల్లం. ఇయ్యాలకి జనం ఆ వూసే మరిసిపోనారు. జరుగుబాటు నేక ఇయ్యాలకా బెల్లం పదునే మనఁ మరిసిపోయి ఆదొగ్గేసి యీ తీపి కల్లకే అవిఁరిపోనాం" అంటూ నూరిన రెండు కత్తులూ బడితెమీద పెట్టి; తాటాకులు కోసి ఐదారు పాయలుచేసి; ముంతనీ, సీసాని కడవ దగ్గిర గడ్డిమీద పెట్టి; కావిడితీసి ఖాళీకుండలు జాగ్రత్తగా సర్ది పేర్చి వుంచేడు.

"వోరి బాబా! నీతో నాకేటిగాని - నేనా యెనగాడ తోవకాడి పుంతకి యెల్లొత్తాను నానొచ్చిందాక పదిలంగుండు" అంటూ తండ్రి సర్దిన సరంజామానీ కావిడినీ తీసుకొని పైడితల్లి బయల్దేరేడు.

"వోరి సిటంసేపు సరకాయించుకెల్ల కూడదేటిరా! మా యేడి మీదున్నావు ఆ కుర్ర మూకెవురయినా కంటబడి నారంటె యిరుసుకు పడిపోకురయ్యా -- నా నొల్లకొనేది నేను. నీ పని చూచుకు బేగి పోర్రా. ఇయ్యాల మటంకాడి బజనకి నా నెల్లాల- వోరోరి ఆ కడం సెట్టుకాడ నేలంతా మెన్నొడిన సినుక్కి ఇవాట గుంటాది నిదానం గెల్లరోయి!.... వోరి నాను మరిసేపానా— మటం కాడ బుడ్డోల్లందరూ "గీత తాతా! యేత తాతా! అని నా సేతులట్టుకు సుట్టూరా తిరుగులాడతార్రా—ఆల్లకి నేతగున్న తాటి మొవ్వ యీత మొవ్వ కోసొట్టుకురారా!" ఇలా కొడుకు కనుమరుగయ్యే దాకా సింహాచలం అంటూనే వున్నాడు.

బాగా సాయంత్రమైంది గూళ్ళకి వెళ్ళే పక్షులగోలా, గాలికికదిలే తాటాకుల గలగలా మినహాగా అంతా ప్రశాంతంగా వుంది. ఆ ప్రశాంతతని రెండు మూడు నిముషాలు భగ్నం చేస్తూ వోరైలు టకటక మని వేగంగా పోయింది.

క్రమంగా వొక్కొక్కడూ తాగడానికి వొచ్చి వెలుతున్నారు. ఏవేవో కబుర్లూ, డబ్బులు యిచ్చి పుచ్చుకోడాలూ జరిగిపోతున్నాయి ఇంతలో

"వోరి మావాఁ యెనాగున్నావేటి? మా యప్ప బాగున్నదా? మీ బుడ్డోల్లిద్దరూ సేత్తికంది కొచ్చినార్రా'' అంటూ ఎరకయ్య వొచ్చేడు. చేతిసంచితో వున్న రెండు ఖాళీ బీరు సీసాల్ని తీసి కిందపెట్టి సంచిపరుచుకు కూర్చున్నాడు.

"యేపేటి యెరకయ్యే - వోరోరెన్నాల్ల కవుపి సినావురా! అనాదెల్లినావు అద్దదే పోక మరిటునేదు. మమల్ని వొపాలి సూడాలనిపించ నేదురా! యిప్పడెక్కడేటి నవుకిరీ?— నా యాడది అనాగే యింటిల సాకతన్నాది— ఆ మద్దిల మా పెద్దోడు తాడేలు కాటుకి తాటిసెట్టు మీంచీ కూలిపోనాడు రా....... యేటో ఆడేటి నా మాట వినుకొనే రకవేఁటి? మా యిద్దరినీ సరుకు సేయకుండా యేరుబడి పోయి సారాబట్టీ యెట్టినాడు. ఆడన్నేయవేఁ తాడేలు గొచ్చి మా కడుపులు కొట్టేసినాదనుకో!.... నువ్వెల్లేతలికి సిన్నగుంటడు గుండేవోడు గందా ఆ పైడితల్లిగాడే యియ్యేలకి మమ్మలిద్దర్ని సాకతావొత్తన్నాడు.

ఆడికింకా పెల్లి సెయ్యాల.... నన్ను సూత్తన్నావుగదర. నాసిలా బయిటి కవుపింనడవేఁ దేనికీ పనికి రాకుండ గున్నానుర. యేటో పైడిబాబు గోడు కసురుకు కూకోమన్నా పొద్దుగూకులా యింటికాడుండనేక వో సుట్టిలా ఆడికి సేతి సాయంగుటానని వొచ్చి కూకుండబడిపోతన్నాను. యె నాగుండే వోన్నె లాగయి పోనానా నూడర. కాటిక్కాలు సాపుకొన్నట్టయిపోనాదంతె!....

'సచ్చేటందుకు పుట్టియున్నవు - సందుల దూరకు రోరన్నా!
యెన్నాల్లుండిన యవుఁడు యిడవడు - యెందుకు జడిసేవోరన్నా!'

వోరెంత బాగా సెప్పినాడో యినుకొన్నావా" అంటూ పింహాచలం వో పాయనిండా కల్లుపోసి ఎరకయ్య కందించేడు.

"నీ సేతుల్తో యిచ్చినావని తాగతన్నాను మావాఁ! అదేటో యీ వూరొగ్గేసి కొత్త నవుకిరీలో కుదురుకొన్న కాడినుంచి వోరయ్య నానొకటే తాగుముచ్చు నయిపోనానంటె నమ్ముతావుర! వోరి నాను తాగడానికి బుడ్డెత్తి నప్పుడల్లా యిసిత్తరంగ నీమాటలె యినిపించేవిర?! ఆ సారాకాయల నువ్వాగు పించే వోడివిర! తెగ గింజుకునాడిపోయి సివరికి ఇసాకపత్తనానికి బదిలీ అయ్యే కాడికి నా ఆడవాయి మీ దొట్టేసుకు పూరాగా తాగుడొగ్గేసినానురా! ఇయ్యేలకి దాని వోసనకె యెలపరం వొచ్చినట్టయి పోతాదిర.... అయ్యేల కియ్యేల మల్ల యీ తీపికల్లు రుసి సూత్తన్నాను "అని పాయని కల్ల కద్దుకొని తాగుతూ "మనూరు జిల్లా అయినాదొ నేదొ నాదేస యిటు తిరిగిపోనాది. సానా కొకులడి యీ వూకుల యెల్తాపీచునోకొచ్చేసినాను... వొరె అందిలున్న మా ఆపీచరు మా గొప్పోడునే. యిసాకపత్తనంల వున్న ఆడి నేస్తుగాల్లంతా వోరయ్య యేం సదువులుర ఆల్లవి! కూకున్న కాడినుంచి నెక్కుండ అనాగ్గాజు బుడ్డీల యేటేటో వోసుకొని సారాదీపం కాడెట్టి దించీ అనాగటి దిక్కే సూత్తా కాయితాల యేటోటో గిలుక్కుంటూ వుండిపోతార్ర. యియ్యేల కాల్లంత యీ వూరొచ్చి నారు. మా ఆపీచరూ ఆల్లూ కనగా పునగంగా కూకొని యీ తీపి కల్లంటే యేటో యిసిదం సేసుకొందావఁని మూడు సుట్లు యేకాడినుంచో కల్లొట్టుకొచ్చి నాబంనేక యిసికొంటున్నారుర. నానొకటో రకపుఁ వొట్టుకొత్తానని నీదగ్గరకు లగెత్తుకొచ్చినాను" అంటూ జేబులోంచి వో పదిరూపాయల నోటు తీసి పైడితల్లి చేతిలో కుక్కుతూ "ఆల్లిమ్మ నిచ్చింది - కాదనుకుర" అన్నాడు సీసాలకి మూతలు తీస్తూ.

"యెంత గురివుంచినావుర నామీద!. సానా మంచిపని సేసినావుర తాగుడాగ్గేసి! వొరె నా యాడంగిని వోపాలి సూసిపోవేటి-తెగ సంబరపడిపోతాది! సిటం వుండర మా బుడ్డోడొత్తాడు. నా కాలంవాడు నా నెట్టగుండేవోడిని అదిగనాగె అచ్చుమచ్చు గుంటడంటది మీయప్ప ఆడిని సూసినప్పడల్ల. సూసెల్దుగాని వుండరెహె" అంటూ కల్లుపోసిన సీసాల్ని పక్కకు పెట్టేడు. సింహాచలం.

"నిదానంగా మల్లోసుట్టు నా యాడంగి నొట్టుకొత్తాను నేర. అల్లంతా నాకోసం కాసుక్కూకుంటరని తొందరగున్నదంతె. ఇక యీ వూరుల గదేటి మా కాపురవు..... వొరె యెవ్వురా మొన్నా యెనగాడ కొండకాడ సచ్చిపోనరు?! "అన్నాడు ఎరకయ్య లేవబోతూ మళ్ళా కూర్చొని".

"అల్లా పొలిమేరకాడ రంగులమేడ నేకుర - అందులుండేవోడు బుర్ర మీసాలెట్టుకొని! ఆడికొడుకు సానా సిన్నవయసే యేదో గొప్ప సదవే సదువుకొని ఆడి నేస్తుగల్లని వోటాదార్లుగెట్టుకొని కాకిముచ్చి పేట్రీ యెడదా మనుకొన్నాడు. కాకిముచ్చి దొరుకుద్దో నేదో అని ఆతన్ని మచ్చకొండ కాడా ఈతన్ని యీకొండ సుట్టూరా తెగ యెతకతన్నారట ఇదిగింతలో వో వొండ లోకి యెల్లినారొ నేదో అంతె నోపల తొంగున్న యెలుగ్గొడ్డొచ్చి అక్కడకక్కడే యీతిని పీకి సంపేసినాదిర!"

"వొరె నాను నమ్మింది సెబతా నినుకొంటావుర?!- ఆడిబాబు ఆ మేడెలాకట్టినాడొ తెలుసా!- నా నింతున్నప్పుడుర ఆ నెల్లిమర్లేరు వూట గడ్డనోకి యెగదట్టు కొచ్చేసి నాడిటరా వోరయ్యో ఆ నీళ్ళన్నీ పొంగుకొచ్చి ఈ మూడు కోనేర్ల జలవుతో ఏకవై పోనాయి. యీ పొలిమేరలన్నీ కొండ తట్టుదాకా యేకంగా జలమయవై పోనాయిర. వొందలమందికి జెనం సచ్చి పోన్నార....అదిగలాంటి సమయవులో యీ మీసాలోడు లేనేడుపు అరువు తెచ్చుకు "మాయమ్మ సచ్చిపోనాదిరోయ్" అని అన్నేయంగా మాటపుట్టించి సెవాల మద్దిలొడి తిరిగీనాడు ఏ సెవంముక్కూ సెవీ యిలవగుంటే ఆ పీనుగు మీదీడు ఇరునుకు వొడిపోయి "వోలమ్మో" అని రాగాలు తీత్తానే ఆ ముక్కూ సెవులకున్నవీ సేతులకున్నవీ వొల్చుకు మడిసేసినాక "వోరయ్యో యిది మా యమ్మ కాదురోయ్" అని మరో నదురుగున్న సెవం కాడికి

లగెత్తుకుపోయేవాడు!- యిదిగో యీ నెక్కన అన్నేయంగ మడిసిన దబ్బుతో మేడకట్టినాడు. మరాడు యేవఁయిపోనాడనవేటిర?!- ఆ మద్దిల గుడ్డిల ఆడుఁడగ కలివిఁ గోల పంజాదెబ్బ కొట్టి దిక్కులేని సావు నంపినాది! ఇంకా అన్నేయం తీరనేదు --యిప్పడీ బుడ్డోడమాయకంగా యెలుగ్గొడ్డుకి బలయిపోనాడు.

అందర వెఁళ్ళిపోడం తప్పదు. బతికేటి బాపుకోవాల సెప్పు? వున్నన్నాళ్లు నాయవుఁగ గుండె మీాస్పెయ్యేసుకు బతకాల. అసెలుపెంచు కొన్నాడికీ, అన్నేయం గున్నోడికీ అదప్పతనవుఁ తప్పదుర. వొరె నానన్నదానికీ యిద్దరి సావులూ నిబద్దిగావేఁటిర?! దీన్నెంత సక్కంగ యిసిదంసేసినాడో యినకో—

“పస్సాని సేలపయి బాంతి వొడియున్నావు-

పుచ్చులొగ్గి యున్నారు సిలకా

వుచ్చూల వొడసేల! వూపిరీ వొగ్గనేల!—

ఆనందవూఁ మనకేల సిలకా”!

ఎరకయ్యలేచి “వోరి నీకు దన్నవుఁరా! నువ్వెప్పటి కొక్కనాగే వున్నావుర. నీయంత సూటిగెవురుండగలర్రా-యేటో నీ పిచ్చిగాని! యీ రోజుల అన్నేయానికి యెంత దూరవుఁ గుందామన్నా యీ లోకవెఁ వుండనీదుర సివ్వాఁసెలం! అయిన కాడికి సెయ్యొగ్గుకు పోవాల్నంతె అలాక్కానోడికి కూడేనేదు - మరిదెలాగరా?!...........వొరె పయిడి బాబిఁకా రానేదుగాని నానెల్లొత్తానుర - ఉకాడ ఆల్లు నాకోసం కాసుక్కూకుండిపోతారు'' అని సీసాల్ని సంచీలో పెట్టుకొని వెళ్ళిపోయేడు.

ఇఁతల్లో పైడితల్లి వొక్క వుదుటున గబగబ వొచ్చి కావిట్లో వొకవైపు పదిలంగా పట్టుకు తెచ్చిన కుండపెంకుల్ని తండ్రికి కనిపిఁచేలా వో చెట్టువార గుమ్మరిస్తూ అందుకున్నాడు— “యిల్లిదిగిటు సూడరయ్య— నీ సత్తెకాలబ్బుద్ది కేటొరిగినాదొ! సట్టిలన్నీ యెనాగ బొక్కలెట్టేసి యిరక్కొట్టినారో సూసుకోరా! యిదిగిదంతా ఆ యిస్కూల్ల సదవు లెలగ బెట్టే ఆ పొలిమేర యీాదులవున్న గుంట నాకొడుకులు సేత్తన్నపని ఆ కుర్రసచ్చినాల్ల నొట్టుకు సెట్టుకోడి సెప్పున తడపలెట్టి యిరిసికట్టెయ్యాల. అయినాక నేపాలం రువ్వలొట్టుకు తొక్కలొడిసెయ్యాల. అయ్యాల గ్గాని ఆల్ల తలకెక్కదాల్లేటి సేత్తన్నారో—నా

తడేకా యేటో! ఆ యీమల కంతనెక్కా వోనుట్టు నా తడాకా అంటేటో రుసి సూపిత్తానానంటె నువ్వేయెనక తీత్తన్నావు ఈ నెక్కని నువ్వే ఆ పోకిరీ సచ్చినోల్లందరికీ అలుసిచ్చేసినావు" అని ఖాళీ కుండల్ని గూనపెట్టి కావిడిని పక్కనపడేస్తూ మళ్ళా అందుకొన్నాడు. "వొరె బాఁబోఁ నీకేటి పట్టనేదుర— నువ్వోల్లకుండ కూకో— నానాల్ల పని సూసుకుంటనింక!— ఇయ్యేల కారేదు. సుట్లయి యెన్ని సట్టిల్ని పగలగొట్టేసినారో— ఆతన్న పోగడున్న కుండ పెంకుల్ని సూడర— గుండె సెరువయి పోతాది! మనకేటి ఆ తట్టిలన్నీ పుత్తి పున్నేని కొత్తన్నాయేటిరయ్య! కుమ్మరి మారెమ్మ తట్టికో నలబయి పయిసా లెన్నెక్కన గుంజుకుంటాన్నాది. యీ జరుగుబాటెనాగవుద్దో నువ్వెసెప్పర" అని వొచ్చిన యిద్దరి ముగ్గురికి కల్లు అమ్మి దూరంగా కూర్చున్నాడు.

"వోరయ్యా యెందుకనాగ నోరు సేసికొంటావు! అంతదురితం కూడదుర— నిదానం గుండాలి మన గెలసారవుఁ వొక నెక్కనుఁడకె యియన్నీ యా రీతి గున్నాయి ఆల్లనని యేటి నాబం. మనం నోలొడేసికోడవేఁ మిగినిపోతాది మన నొసటిల గీత బాగోనేదంతే" ఇలాతండ్రి అనీ అనగానే సర్రున లేచి నిల్చుని చేతులాడిస్తూ కొడుకందు కొన్నాడు—

"యేటోరయ్య అంతా మన గెలసారవూఁ గీతా అని కూకుంటే కుదురుతాదేటిర?! రేపీకాడికి కొత్త సట్టిల్నేకపోయినయ్యంటే మరి గీత పనెలా జరుగుద్దోరయ్య? డబ్బోసు కొట్టుకొచ్చినా ఆ కొత్త తట్టిలన్నీ నీళ్ళలెంత నానెట్టినా సయిఁమని కల్లు సగానికి సగం నాగేత్తయి!— అనా ముదనట్టపోల్లందరికీ కల్లు నెత్తికొచ్చినాయిరయ్య! యీ కంతిరీ నా కొడుకులందరికీ సదువు లబ్బుతాయని నెలకింత సొప్పున సరకారోల్లు డబ్బులిత్తన్నారు ఆ డబ్బులు కరుసయ్యేదాకా మీసం రానిగుంట సచ్చినాడు కాడినుంచీ వొల్లు తిమ్మిరెక్కించు కోడవెఁ; డబ్బులయిపోనాక కుతితీరక యిది గినాగ రాల్లొట్టుకు తట్టిలకి సిల్లులెట్టి తాగడవేఁ రివాజయి పోనాది.

"వోరొల్లకుండరేసి - దీనికి దానికి ముడెడతావేటిర! యేటి నీ కులపోల్లని సదువుకో వద్దన్నారేటి?! మద్దిల ఆ వూసెందుకు— ఆల్లేటి యీల్లని తాగి దండనా లాడమన్నారేటి. కుసింత వోరుసుకుండాల! యెదటోడు సిన్నొట్టుకు అన్నేయవుఁగ కొట్టినా నువ్వు బరాయించుకు సొంతఁగుఁడాల— ఆదిర మదిస

న్నవోడికి కావాల్న........ ఆల్లేటి వొట్టి కుర్రకుంకలు. అల్లనొట్టుకు తన్ని గలాటా యెట్టినావనుకో– నీకేటి వొరిగిపోతాదిర! ఆ గలాటా అదిగనాగ ముదిరి పోతాదంతె........నువ్వు యేరుపొద్దు లాల్లేటి సేసినా సొంతంగ వోరుసు కుండరా– ఆకాడినుంచీ ఆల్లు నీ జోలికొత్తారేటి సూడు! అదిగనాగ నీ మంసి .తనవెట్టుకొని యెదుటోడిని మంసోడిగ మారుసుకు రావాల్న........"

"యెల్లెల్లోరయ్య– యెల్లి ఆ మటంకాడో మంజిరంకాడో పొద్దుగూకులా యియన్నీ అందరినుకొనేట్టు సెప్పర నాకాడ కాదు!" అంటూ పైడితల్లి కావిడిలో కుండల్నీ ఇంకాకొంచెం కల్లున్న కడవనీ సర్దుకొని ఏత వీధివైపు బయల్దేరేడు.

సింహాచలం లేచి తన మెల్లో దోపిన నోట్లూ చిల్లరాతీసి కొడుక్కిచ్చి రెండు ఖాళీ తట్టిల్ని పట్టుకొని కొడుకు వెనకనేనడుస్తూ మెల్లిగా అందు కొన్నాడు–

"వొరె ఆసంగతింకొగ్గేసి - యిపుడు సెపతంది నానెందుకు సెపత న్నానో సెవినెట్టుకోరా!........వోరం రోజుల కాడినుంచీ నానుసూత్తన్నాను!.... ఆ తీపికల్లు సిటంలో యిక్కడ అమ్మకవై పోదేటిర– అదెందుకింటికెత్తి కెలత న్నావు? నాను నిదానించుకు చూసి నాకే నిన్ను నిగ్గదీసి అడుగుతున్నాను.— వొద్దుక అనాగ మురగబెట్టినాక నానాగడ్డీ కలిపి మురసరంగ అమ్మకుర– తాగి నోల్ల కడుపులన్నీ దొలిసేత్తది. అందిల తాటికల్లు మురసంగున్నాదంటె కీల్ల పట్టు లొగ్గేత్తాయిర– అయినాక వోతంకూడా కమ్మేసు కొత్తాదిర. యెదవ అనగా జెనం రంజుగులిటదనీ; సేసే బండ సాకిరీ తెలనియ్యదనీ; తిమ్మిరెక్కి– కాయకట్టం మరిసి తొంగులిడచ్చనీ– సెవటోడిసి తెచ్చుకొన్న డబ్బులన్నీ మనకోసి తెగతాగిపోత్రార. అయినాక ఆ రికసా నాగేవోల్లూ కలాసీవోల్లూ కాల్ల పట్టులొగ్గేసి రికసాన్నాగలేక బరువులెత్తనేకా సేత్తొ కడుపు లొట్టుకు లుమ్మ సుట్టుకు పోత్రారా....ఆల్లపెల్లాల పిల్లల వుసురెవరికిరా తగుల్తాది?!.... వొద్దుర నా మాటినుకో. కింకపట్టు వొగ్గేసి నాను సెప్పింది తలాయించకుండ ఆ కడవ లున్న కల్లు ఇదిగిల్లిక్కడె అమ్ముకింటికెల్లరా." అంటూ కొంచెం వేగంగా అడుగులేసి కొడుకు దారి కడ్డొచ్చేడు.

"అదేటి నేదునే! అడ్డునెగు.... నానేటి అమ్మన్నే!........యియ్యాల. నా సంగాతకాల్లొచ్చి సరదాగా బాలు సేసుకొందవన్నారు. ఆల్లకోసం వొట్టు కెలతన్నాను.–" అన్నాడు తండ్రి మొహంలోకి చూడకుండా పక్కగా తప్పుకొని మెల్లిగా ముందడుగేస్తూ.

"నఫ్ యెదవా— నా కడుపున సెడబుట్టినావుర. అన్నేయం సేసింది సాలక బొంకులాడ తవుర . బొంకులు!?.... ఆకాడికి నాని దిగిప్పుడన్నదంత నాను పుట్టించినానంటావేటిర యెదవ నాకొడక! నాకేటో అనుమాన మొచ్చి మెదన కుండ నాలుగు రోజులు కాడి నుంచి పరకాయించుకు నూసుకొత్తన్నాను. ఆ పెంటయ్యగోడు సాయంగా నీకాడ మొన్న తాగొచ్చి నాకు సెప్పినాడు గాదేటి ఆడిని నానే అంపినాను. వొక్క సీసాకాయ తాగొచ్చే తలికె అదికి దిమ్మతిరిగిపోయి సుక్కలవుపింసి నాయిట?!... ఆకాడికీ నానెందుకేటని నిన్న మీయమ్మతో నీకు సెప్పించినాను....వోరి ఆ రిట్టుకాయల పులుసూ, కల్లు తట్టి మడ్డీ, గెంజీ - ఇయన్నీ కలిపేసి ఆల్ల కడుపులు దొలిసేసి అల్ల పెల్లాల పిల్లల కడుపులు కొట్టి నువ్వు గుంజుకుంటున్న ఆడబ్బు రంగూ, యానీ సేతిలో వున్న డబ్బురంగూ యేరీతిలో గుంటదో.......కల్లుంటే యిప్పుకు సూడరా అవుపిద్ది?!.....సీ ....!అన్నాడు సింహాచలం మఠం తోవ యేతవీధి తోవ విడే చోట ఆగి.

"బజనకేలవుతున్నాదెల్లు.... నాకు నీకు సరిపడనేదునే! నాదారీ నీదారీ యిదిగినాగె యేరడిపోతన్నాయి........ నానింక యెల్లి పోతన్నాను" అన్నాడు పైడితల్లి నడుస్తూ.

సింహాచలం తక్కన అదోలా కొడుకుని చూసి ఏమనుకున్నాడో— కొడుకుని అనుసరిస్తూ వో రెండడుగులు వాడి దారిలోవేసి ఆగి—

"వోరోరి - అనాగనకూడదని యెన్నిసుట్లు సెప్పినాను - మల్లదిగనాగే అంటావేటి?!... "యెల్లొత్తాను" అన్లేవేటి?!......నాన్నమ్ముకొన్న మాట నీకు సెప్పినాను గాని నానేటి సెట్టంతున్న నీకు సెప్పగల వోడినేటి?! యెల్లిరా— నీకేటైనా బాగనిపిత్తాదో అనాగెసెయ్యి!" అంటూ చేతుల్లో వున్న కుండల్ని

మెల్లిగా కావిట్లో సర్దేడు - కావిట్లోవున్న ఈత మొవ్వ తీసుకొని, వో ముక్క చిదిమి కొడుక్కిచ్చి మిగతాది పట్టుకొని మఠంవైపు తిరిగేడు.

ఏత వీధిలో వుండే ఏతవాళ్ళ సంవత్సరంలో నాలగైదు నెలలు గీత పనితోనూ; రెండు మూడు నెలలు తాటికమ్మ పనుల్తోనూ; మిగతా నెలల్లో ముంజెలూ, యీతపల్లూ, తేగలూ అమ్ముకొంటూనూ బ్రతుకుతారు. ఆడవాళ్ళ తడపలు తీయడం; తాటినార నుంచి యీనెలు తీయడం చేస్తుంటారు. ఈనెలని రోడ్లపై ఎండబెట్టి కట్టలు కట్టి; ఎందుకో ఎక్కడికో తమకే తెలీకుండా దళారీలకి అమ్ముకొంటారు. ఆ కట్టలు ఇటు బ్రష్‌ల తయారికి మనదేశంలో ఎక్కడికో వెల్తున్నాయంటే నమ్మినా నమ్ముతారేమోగాని; కలకత్తా మద్రాసుల మీదుగా అటు జపాన్ లాంటి పైదేశాలకి అవి పోతున్నాయంటే వాళ్ళనమ్మ నైనా నమ్మలేరు!

ఆనాటిరాత్రి అన్నం వొండుతున్న ఆదెమ్మ తన కొడుకు తెచ్చిన కల్లు తెచ్చినట్టే యింట్లో వుంచేయడాన్నీ; యింటిముందు నులక మంచం వేసుకు కూర్చొని కల్లుకొచ్చిన వాళ్ళందరికీ లేదనిచెప్పి పంపేస్తుండడాన్ని వోకంట కనిబెడుతోంది.

"మీ బాబుకీ రాతిరంతా బజనతోనే తెల్లారిపోతాది. నువ్వు నెగు–కూడు వుడుకెట్టేసినాది''–అంటూ ఆదెమ్మ వుడుకునీళ్ళ కుండనితెచ్చి గుమ్మం దగ్గిర పెట్టింది.

మళ్ళీ యింట్లోకి వెళ్ళి రాజుకుపోతున్న మంటని వీలైనంత తగ్గించ డానికి ప్రయత్నిస్తూ పొయ్యిలో గోగుపుల్లల్ని దిగసన లాగి. పుడిసిలితో నీళ్ళని మంటపై చల్లి మరీ వొచ్చింది! లేచొచ్చి పైడితల్లి వొంటిపై వేణ్ణీళ్ళని చన్నీళ్ళతో తొరిపి డోకితో పోస్తూ ఆదెమ్మ—

"వోరయ్యా నానుగాని మీ బాబుగాని యింకెన్నాల్లుంటవోఁ సెప్పర! మా కింకయెవురున్నార్ర?!........మమ్మల్నింత బూడిస్సేసిందాకన్నా ఆ మున నోడి మాటకి కసింత సెల్లుబాటుండేనాగ మెదనకుండ నువు నడుసుకు పోకూడ దేటిర!.....మాటకాడ మాటాడుకుంటు మీ యిద్దరినాగ నజావుగుండకుంటె— నా నెందిల వొడిపోడవోఁసెప్పు" అని అంది యేడుస్తూ.

"అదేటి వద్దిల నువ్వేడుసుకుంటా వేటోలమ్మా!.......... ఒల్లకుండె హెయ్!.... నానేటి సేసినానొసెప్పు నానాడి కొడుకును గాదేటి?! నాను తప్పు సేసినానని— ఆడుకాదు— వోలమ్మ నువ్వొప్పుకొన్నావంటె— యిగిగో దోకి కఱ్ఱతో వన్నొట్టుకు సితకబాదె నానేటి నెపఁవెట్టను! నానేటన్నాను యీ రోజుల కరుసు వూరికే సేంతాడు నాగా పెరిగిపోతన్నాది. ఆడన్నేయ వన్నేయమఁటూ. యినాకూ్కుంటే నీ సెవుల్దీ ముక్కుదీ వూడనాగి యెన్నాల్లీనెక్కని సరిపుచ్చుకుంటవోఁ సెప్పెహెయ్!

యింకేటున్నాది......మల్లొచ్చె పున్నాంకల్ల తేంటీగలు పట్టొగ్గేసి తాటిసెట్టెక్కి కూకుండిపోతాయి. యింకేటి మిగల్తాది! యీ సందిల ఆ పోకిరి సచ్చినోల్లు ఆ పెండిల మొత్తం కాడికి వొక్క సెట్టుకి వొక్క సుక్కన్నా వొగ్గడవుఁ నేదు సరిగందా తట్టిల్కి తట్టిల్నే యిరకొట్టి పోతన్నారు. యీ నట్టఁవంతా యేకాడికి వూడుసు కోడవోఁ వోలమ్మ నువ్వేసెప్పే నానినుకొని మెదనకుండ సజావు గుండిపోతాను!—" అంటూ వొళ్ళు చేతుల్తోనే వోడ్చుకుంటూ తుడుచుకొని, నీళ్ళుకారే బుఱ్ఱని తల్లి కందించేడు. ఆదెమ్మ కొంగుతో తన తల తుడుస్తుంటే మళ్ళా అందుకొన్నాడు.

"యీ రోజుల యీడి తీపికల్లుని వొల్లు సల్లగుంచుద్దనీ; వొంటిని యినప కమిసీనాగ వుంచుద్దనీ యెవుడే తాగతన్నాడు?! మీసం మొలవనాడి కాడినుంచీ వొల్లు తిమ్మిరె కావాల! యియ్యాలీ కాడికి తాగితె రేపీకాడిదాకా నిసా గుండాల! పట్టొగ్గేసినాదా వోలమ్మ రేపాడు తాగడానికి నీకాడికొత్తదేటి?! యియ్యన్ని బాఁబుఁకేటి తెనుత్తాయినే! వోలమ్మ ఆడికి యీరబ్బమ్మంగోరి గీతాలు యిసిదవైఁనట్టుగ యీ లోకరివాజు యిసిదం కాదునే!

మొన్నెల్లిన కావిటి పండక్కాడినుఁచి యీరెన్నెల్ల - నానేటి మురసం గమ్మితె ఆడికెందుకు? నానాడి మాటని సరుకుసేయకుంటె నీకెందుకు?— నానమ్మగొచ్చిన డబ్బుతో ఆ అబ్కార యేలంపాట కొట్టుకొచ్చిన డబ్బుఁతా నయాఁపయిసాతో సెల్లెట్టేసినాను. యింక మిగులుకొన్న డబ్బుల్తో మద్దేన యేటి సేసినానొ... యెల్లి ఆగోడ గూటిల నానెట్టిన పొట్నం యిప్పిసూసి కల్లకద్దుకొని మరీ సెప్పేలమ్మ నానెలాగ నడుసుకుపోవాల్నో...నా పనయి పోనాదినే! నానికమ్మన్నే!" అంటూ పైడితల్లి అన్నం తబుకు దగ్గిర కూర్చున్నాడు.

అన్నం తిన్నాక పైడితల్లి తన పెత్తండ్రి కొడుకైన నల్లమారిని పిలిచేడు. ఇద్దరూ కలిసి కడవలో మిగిలిన కల్లు తాగి; గుమ్మందగ్గిర నులక మంచం మీద కూర్చొని చుట్టని కాల్చుకొంటున్నారు. దూరంగా రైలు తెగ కూసి కూసి నిశ్చలంగావున్న కొండని కదిలించేస్తున్నట్లు ప్రతిధ్వనిస్తూ ఉదుటుగా పరుగుపెట్టి మరీపోయింది! రాత్రి పది దాటింది మసక మసక వెన్నెల. తుంచిన చిన్న తాటిమొవ్వ ముక్కలాగా వున్నాడు చంద్రుడు. ప్రశాంతంగా వుంది వాతావరణం. దూరంగా మఠంలోంచి తారస్థాయిలో లేచిన సింహాచలం గొంతుక గాలితో కొట్టుకొచ్చి లీలగా వినిపిస్తోంది.

"యెంతో కాలవుఁ బతికేనంటవు - యెపుడు పోతందోరన్నా
సంతకోట సంసారమిదియని;— "సతతవుఁ" అని నమ్మకురోరన్నా!
ఆనందవుఁగ అమురుతవుఁండే - అత్తవ యెరుగర వోరన్నా
సాదులతో సంగతిసేసీ - సంది యెరుగుర వోరన్నా!"

వున్నట్టుండి దూరంగ కుక్కలు పెద్దగా మొరగడం వినిపించి పైడితల్లి ఠక్కున నల్లమారి భుజం పట్టుకు లాగేడు. వాళ్ళ కిత్తయ్య కోనేరుదాటి రైలుకట్ట దిగూకీ వెళ్ళేసరికే పెద్దగా కుర్రాళ్ళ కేకలూ ఈలలూ - వూరివైపు వినిపిస్తున్నాయి! పక్కనున్న నేపాళం చెట్లని పీకి రెండు రువ్వలు చేసి నల్లమారి కోటిచ్చి తానోటి పట్టుకుని పైడితల్లి వుదుటుగ పరుగుపెట్టేడు.

కీచురాళ్ళూ చిమ్మెట్లూ చేసేగోల నరసయ్య కోనేటిలోని కప్పల గోలతో పోటీ పడుతోంది. మసకబారిన వెన్నెట్లో తాటిచెట్లు కొడిగట్టి ఆరిపోబోతున్న కాగడా కొయ్యిల్లా వున్నాయి! జీబుగావున్న పుంతల్లోంచీ అంచనాగా అలవాటుగా పరుగెట్టి వీళ్ళు నాటురోడ్డు చేరేసరికి గోల మాటుమణిగింది! నల్లమారిని వూరివైపు వెళ్ళమని పైడితల్లి కొండవైపున్న పెండెలోకి వెళ్ళేడు. తాను కుండలు కట్టిన చెట్లపైకి కల్లు చికిలించి చూస్తూ వెళ్ళి వో చెట్టుకింద ఆగేడు. చెట్టుమీద కమ్మల్ని పక్కకితోస్తూ కుండల్ని సవరిస్తున్న శబ్దం స్పష్టంగా విన్పిస్తోంది. వీలైనంతగా వొంగి వొంగి మాను మొదట్లో గొంతికిల్లాకూర్చొని చెట్టు మొవ్వలో వున్న ఆకారాన్ని చూస్తున్నాడు. జుత్తు విరగబోసుకొని నిల్చున్న మొగదెయ్యాల్లాగా తాటిచెట్లూ; ఆడదెయ్యాల్లాగ ఈతచెట్లూ పైడితల్లికి కన్పిస్తున్నాయి!

వున్నట్టుండి చెట్టుమీంచి దభీలుమని వో నల్లని పెద్ద ఆకారం పైడితల్లి మీద పడడం; పైడితల్లి పెద్ద చావుకేక వెయ్యడం వొక్కసారి జరిగేయి. నల్ల మారి వచ్చేటప్పటికి గుర్రు గుర్రుమని గురకపెడుతూ; ముట్టెని పైకీ కిందకీ తాటిస్తూ; అటూ ఇటూ తూలిపోతూ లేస్తూ కొండమీదికి పోతున్న ఎలుగుబంటి కనిపించింది. పెద్ద మూలుగుల్తో రక్తపు మడుగులో నేలకర్చుకుపోయి పైడితల్లి పడివున్నాడు.

శవ జాగరం భజనలతో తెల్లారిపోయింది. తల్లి ఆదెమ్మ శవానికి స్నానంచేయిస్తూ మరోసారి మొగతిరిగి గుమ్మంముందు పడిపోయింది. తిరిగి తెలివొచ్చేసరికి ఇంటిముందంతా ఖాళీ అవడంతో తమాయించుకొని ఇంట్లోకి వెళ్ళి గూట్లో రాత్రి విప్పిన పొట్లాన్నిచూసి తిరిగి కాగితంతో అలాగే లుమ్మ చుట్టి పట్టుకొని ఎవరెంత వారించినా వినక శ్మశానానికి పరుగుపెట్టింది. భర్త తన జెబ్బలు పట్టివెనక్కి లాగుతుండగా బలంగా ముందుకువంగి కట్టెల మీదున్న కొడుకు నోటిని బలవంతంగా ఎడంచేసి, చేతిలోని పొట్లంలో బంగారు పిసర్లని వొంపేసి వెనక్కి భర్త చేతుల్లోకి వాలిపోయింది!

ఏనాడూ— కనీసం పెద్ద కొడుకు చచ్చిపోయినప్పుడు కూడా— ఏడవని సింహాచలం యేడుస్తూ కొడుకు తలకి కొరివిపెట్టి; అక్కడే అలా చితిదగ్గిర భగభగ రాజుకొస్తున్న జ్వాలలు తన మొహానికి తాకేలా లేస్తూంటే నిల్చుని యెదురుగా చూస్తూ— “వోరి పైడిబాబూ - వొక్క నా కోసంవేం నీకిట్టంనేకున్నా నాయాన్నొట్టుకుని ఆయిదైదులన్నా కల్ల సూడకుండా యెల్లిపోతన్నావురా! వొరె కొడుకా—నాయాన్నొట్టుకు నానేటి మిగులుసుకున్నానురా—వొయసు మిగులుసుకు వుండిపోనానుర పయిడితల్లీ!— యీ నాయాన్నొగ్గేసి మీకన్నా ముందుగన్నా పోయినాను గాదురా—” అని అంటుండగానే వొక్కసారి వొల్లూగిపోయి ముందుకు జోగిపోయేడు!

శ్మశానంలోంచి లేచిన పొగ— కొండమీద మేడను అందుకొంటుందా అన్నట్టు పైకిపోతోంది! కాని, తాటిచెట్టంత ఎత్తుకు పోయేసరికే రూపుమాసి పోయి గాలిలో కలిసిపోయింది?!

—“భారతి”, 1980 డిసెంబరు.